# జీవితరంగం

## – స్వరాజ్య పద్మజ కుందుర్తి



వందేళ్ళ క్రిందట.. ఇద్దరు అమ్మాయిలు, పదేళ్లకే వితంతువులయ్యారు, అమ్మానాన్నలు లేరు, నమ్మినవారు ఆస్తి అంతా దోచేశారు, జీవితాంతం ఎలా గడపాలి? జీవితపోరాటాన్ని కొనసాగిస్తూనే గాంధీగారి పిలుపునందుకుని స్వాతంత్ర్యోద్యమంలోకి దూకారు, ఎక్కడో బహిరంగసభలో తలిదండ్రులనుంచి తప్పిపోయి ఏడుస్తున్న పసిపాపను అక్కున చేర్చిపెంచుకున్నారు, ఒకవైపు తమదైన జీవనపోరాటం, మరోవైపు దేశంకోసం పోరాటం.. వీళ్ళు చరిత్రపుటల్లో కనిపించకపోవచ్చు, పెద్దల ఉపన్యాసాల్లో వినిపించకపోవచ్చు.. కానీవాళ్ళు ప్రదర్శించిన ఆ పోరాటపటిమ గురించి తెలుసుకుంటుంటే ఒళ్ళు గగుర్పొడుస్తుంది, నిలువెత్తు స్ఫూర్తిశిఖరాలు కళ్ళముందు కదులుతాయి. వాళ్ళపేర్లు– కనుపర్తి హనుమాయమ్మ,కొండా సత్యవతమ్మలు. అలనాటి వాస్తవ సంఘటనలను వారి మనవరాలు స్వరాజ్య పద్మజకుందుర్తిగారు నెలనెలా కథన రూపంలో మనకందిస్తున్నారు.



కనుపర్తి హనుమాయమ్మగారు



కొండా సత్యవతమ్మగారు

## ఆలయ ప్రవేశం

"**అమ్మమ్మా!** ఆతరువాత ఏంజరిగింది? తెల్లారి హరిజనుల ఆలయ ప్రవేశం జరిగిందా? అంటే ... ఆలయ ప్రవేశమంటే ఎలా చేసారు? అందరూ వచ్చి దేవుడి విగ్రహాలు తాకారా? పూజలు చేసారా? " నా ప్రశ్నలకు అంతేలేదు. అమ్మమ్మ మాత్రం అంత హుషారుగాలేదు. ఆ సంఘటన తాలూకు చేదు అనుభవమేదో ఆమె మనసులో కదలాడిందనుకుంటా, బాధావీచికలేవో ఆమె ముఖంలో తెలుస్తున్నాయి.

తెల్లవారింది ఊరికి దూరంగా ఉన్న పల్లెలో తప్పెట దరువులు మారుమోగుతున్నాయి. అందరూ స్నానాలు చేసి, ఉన్నంతలో పరిశుభ్రమైన బట్టలు కట్టుకోని నేదరి తట్టల్లో పూలు, పండ్లు, పసుపుకుంకాలు, కొబ్బరికాయలూ తీసుకుని మావూరి రామాలయం దగ్గరికి ఊరేగింపుగా వచ్చారు. మోతుబరుల ఇళ్ళ వాకిళ్ళు మూసే ఉన్నాయి.

ఎనిమిది గంటలకల్లా పేటనుంచి రావలసిన పెద్దలందరూ వచ్చారు. పూజారి ఆరోజు నైవేద్యానికైనా గుడితలుపు తియ్యలేదు. అక్కయ్య వెళ్ళి సీనాచారిని పిలిచింది. ఆయన నమస్కారం చేసి " అమ్మా మేము దేవుడి సేవలో పొట్ట గడుపుకునేవాళ్ళం గుడితలుపులు తీయరాదని పెద్దల ఆదేశం నేనేమీ చెయ్యలేనమ్మా" అని తలుపు వేసు కున్నాడు.

అప్పుడు అక్కయ్య " ఈ గుడి మా వంశీకులు తరతరాలుగా ధర్మకతృత్వం చేస్తున్న గుడి దీని తాలూకూ ముప్పై ఎకరాల భూమీ మా తాతగారు ఇచ్చినది నేను చెప్పినా తియ్యవా ... సరే నీ మొహమాటం నీది తాళాలు ఇలాతే నేనే తీస్తాను" అంది. " అమ్మా ఆడవారు... ఐనా ఇప్పుడు వంశపారంపర్య ధర్మకర్తలు కరణం గారు వారు చెపితేకానీ ఇవ్వలేనమ్మా" అన్నాడు.

కోపం వచ్చిన అక్కయ్య "వాడూ నువ్వూ చేసేది ఏమిటయ్యా? దేవుడు మీ ఒక్కరి సొత్తేమీ కాదు, తాళాలు బిగించి దాచుకోవటానికి" అంటూ గోడమీద మేకుకు తగిలించిఉన్నా తాళం చేతులు బలవంతంగా తీసుకుని గుడి తలుపులు తీసింది. అందరూ " జై శ్రీరాం " అంటూ ఆలయం ప్రాకారంలోకి తోసుకు వచ్చారు. అందరూ అదొకరకమైన ఉత్సాహంలో ఉన్నారు.

వచ్చిన అతిధులను కూడా ఎవరూ పట్టించుకోలేదు. ఈ లోగా శీనాచారిగారు వార్త అందించటంతో మోతుబరులూ, జీతగాళ్ళతో కర్రలతో గుడిదగ్గరికి పరుగెత్తుకుని వచ్చారు. ముందుజాగ్రత్తగా ఉన్న హరిజనులు కూడా కర్రలు తీసారు. ఈ హడావుడిలో అతిధులు వెనుతిరిగారు. వారితో వచ్చిన ఒకరిద్దరు పోలీసులకు రెండుపక్షాలనూ శాంతింపజేయడానికివీలు కాలేదు.

ఒక్క నిముషం లోనేవడగళ్ళు పడ్డట్లు టప టప కర్రల శబ్దమూ " అమ్మో! అయ్యో!" అనేకేకలూ వినిపించాయి. గుంపును అదుపుచెయ్యాలన్న ఉద్దేశ్యం తో పోలీసులు గుంపులోకి జొరబడి, గట్టిగా ఈల వూదుతూదొరికిన వాళ్ళను దొరికినట్లు చితక బాదారు.

రెండేరెండు నిముషాలలో ఆ ప్రాంతమంతా యుద్ధం ముగిసిన తరువాతి యుద్ధ భూమి లా తయా రైంది రక్తాలు కారుతూ ఆడా, మొగా యుద్ధంలో క్షతగాత్రులు లాగా పడిపోయి మూలుగుతున్నారు.

ఈ గొడవలో అక్కయ్యకు తలకి గాయమైంది. కుడి చెయ్యి విరిగింది. తెల్ల ధోవతీ అంతా తడిసిపోతూ ఎర్రని రక్తం కారిపోసాగింది. అక్కయ్యని చూస్తూనే నాకు చాలా భయం వేసింది అందరినీ కచ్చేరి చెట్టు కిందకు చేర్చి, కాసిని మంచినీళ్ళు తాగించి గాయాలకు పసుపు వేసి కట్లు కట్టారు.

ఈ గొడవలో కూడా ఎక్కువగా గాయపడింది దళితులే! వచ్చిన పెద్దలు ఇరువర్గాలనూ తిట్టి గాంధీ చెప్పిన మార్గాన్ని అనుసరించక హింసను ప్రేరేపించే దిశగా ఉద్యమం పెడత్రోవ పడరాదని, సామరస్య ధోరణిలో దళితులకు ఆలయ ప్రవేశానికి అనుమతి ఇవ్వాలని రైతులను మోతుబరులనూ కోరుతూ ప్రసంగించి వెళ్ళిపోయారు.

సుబ్బడు చాలా బాధపడ్డాడు. " అమ్మగారూ! ఈ వంకతో మిమ్మల్ని సంపించేవోడేనమ్మా మీ తమ్ముడుగోరు. మోతాదు గాడికి తలమీద కొట్టమని సైగ చేయటం నే చూసాను. నేను ఆడిమీదకు ఉరికి చేతిమీద దెబ్బేశానమ్మా ! అందుకే మీకు తలకు గట్టిదెబ్బ తగల్లా ! అవుడు దెబ్బే కనుక నెత్తురొకటే వచ్చింది ! గట్టిదెబ్బ తగిలుంటే పుచ్చికాయ పగిలిపొయ్యేదే" అన్నాడు.

నాకు కాళ్ళక్రింద భూమి కదిలిపోతున్నట్లు అనిపించింది. కచ్చేరీచెట్టు గట్టుమీద కూలబడ్డాను. అంటే.... అంటే... అక్కయ్య మీద సమయం చూసి హత్యాప్రయత్నం చెయ్యాలనే కసి మొదలైంది. ఆట్టే మేమిక్కడ ఉండటం ఇంక అంత మంచిది కాదు. మూర్ఖంగా ఇక్కడే ఉంటే మా ప్రాణాలకే ప్రమాదం. పైగా ఈ సంఘటన వల్ల ఊరిలోని మోతుబర్లలో సానుభూతిని కూడా కోల్పోయాం. ఇంక సమస్యలొస్తే మా పక్షాన మాట్లాడే రాఘవన్నయ్య లాంటి వాళ్ళ అండకూడా లేదు ఇక్కడ.

వచ్చిన పెద్దలు అక్కని తమకూడా తీసుకుపోతాం ఆసుపత్రిలో వైద్యుడిదగ్గర కట్టు కట్టిస్తాం రమ్మన్నారు. కానీ అక్కయ్య రానంది. ఇంతమంది ఇక్కడ బాధపడుతూపడుంటే నేనొక్కదాన్నీ వైద్యం చేయించుకోనంది. తన చెయ్యి కదలకుండా నా చేత కండువా ఒకటి మెడమీదుగా చేతికి ఉయ్యాలలా కట్టుకుని లేచి, అక్కడున్నవారందరినీ పరామర్శించటం మొదలు పెట్టింది. ఊరిలో వైద్యుడిని పిలిపించి నెప్పితగ్గటానికి కషాయం ఇప్పించి, ఆకుపసర్లు పూయించి మిగిలిన విషయాలు రేపొద్దున మాట్లాడుకుందామని చెప్పి ఇళ్ళకు పంపించింది.

తెల్లవారినాక అందరూ నరసరావు పేట పోలీసు స్టేషనుకు వెళ్ళాలని ఊరి పెద్దలమీద కేసులు పెట్టాలని దళితులందరూ నిర్ణయించుకున్నారు. ఆ సాయంత్రం రాఘవన్నయ్యా ఇంకొంతమంది రైతులూ అందరూ కచ్చేరి చెట్టుదగ్గర మీటింగు పెట్టి మమ్మల్ని కూడా రమ్మని కబురెట్టారు. అక్కయ్య మేమిద్దరమే రామనీ దళితులకు కూడా కబురు పెట్టమనీ అందరితో కలిసి వస్తాననీ చెప్పి పంపింది. అందరికీ చాలా కోపం వచ్చింది. మీటింగు ఆపేసి లేచి వెళ్ళిపోయారు ఊరి పెద్దమనుషులు.

మర్నాడు అక్కయ్యా ఇంకొంతమందీ కలిసి పేటకు వెళ్ళి ఊరి మోతుబరులమీద దొమ్మీ కేసు పెట్టి వచ్చారు. మూడో రోజుకు పోలీసులు ఊర్లోకి వచ్చి కొంతమంది రైతులను అరెస్టు చేసి తీసుకు వెళ్ళారు. రాఘవ అన్నయ్య పేరు మేము కేసులో పెట్టలేదు. మా తమ్ముడి పెరు పెట్టినా కరణం కనుక అరెస్టు చేయకుండా స్టేషన్ కి వచ్చి కనిపించమనించెప్పి వెళ్ళారు.

ఇక్కడ చిన్న తప్పిదం ఏమిటంటే రైతులెవ్వరూ ప్రత్యక్షం గా కర్రలు పట్టుకో లేదు వాళ్ళ జీతగాళ్ళచేతనే గలాటాలో కొట్టించారు. వాళ్ళు కూడా దళితులే! చివరకు ఏమైనా అన్యాయం జరిగితే వాళ్ళకే జరిగింది. మా సవతి తమ్ముడు ఏమి చెప్పాడోగానీ ... పోలీసులు అందరినీ కూచోపెట్టి ఈ ఆలయప్రవేశం అనేది కేవలం ఒక మిష

మాత్రమేననీ, అక్కయ్య దళితులను అలా ఆ వంకతో మోతుబరుల మీదకి ఉసి గొలిపిందనీ, ఒకరి మాట విని గొడవలకు పోకుండా సామరస్యంగా ఉండి సమస్యలు పరిష్కరించుకోవాలనీ చెప్పి అందరినీ విడుదల చేసి పంపించారు.

కానీ ఇదికూడా దళితులకు సామాజిక పరంగా తీరని నష్టాన్నే తెచ్చి పెట్టింది ఆవూరిలో అప్పుడు. మోతుబరులకు కొమ్ముకాసే వర్గం ఒకటి ఏర్పడింది. వారిలోనే రెండుమూడు కులాల్లో మనలో మేమెక్కువ అంటే మేమే ఎక్కువ అన్న భావనలు ఏర్పడ్డాయి. ఆశ్చర్యంగా దళితుల్లో కూడా పెద్దా, చిన్నా తారతమ్యాలు ఏర్పడ్డాయి.

పొలం పనులకు కూడా పిలవకుండా సుబ్బడు లాంటి వారిని దూరం పెట్టారు. అందువల్ల ఆ వర్గంలో చాలా మందికి పూట గడవటం కష్టమైంది. ఆలయ ప్రవేశం వల్ల పెద్దగా లాభపడకపోగా, ఉన్నపనులు పోయి జీవితాలు భారమయ్యాయి. దాదాపు చాలా ఊళ్ళలో అటూ ఇటుగా ఇలాగే జరిగింది అప్పట్లో. అందువల్ల ఆ ఉద్యమం నెమ్మదిగా వెనకబడింది.

అక్కయ్యకు ఆ దెబ్బ తగ్గటానికి చాలా కాలం పట్టింది. మాకూ జీవితంలో కనబడని కవుకు దెబ్బలు చాలానే తగిలాయి. ఊర్లో పెద్దలు, మోతుబరులూ మా మీద జాలి చూపించటం మానేశారు. మొగుడు చచ్చిన ఆడపీనుగలు తమ్ముడి దగ్గర ఇంట్లో పడుండక దేశాన్ని ఉద్ధరిస్తామని బయలు దేరారు. వయసులో ఉన్నారు ఇంగితం లేకుండా బరి తెగించి తిరుగుతున్నారని మా వెనుకనే వ్యాఖ్యానాలు చేయటం మొదలు పెట్టారు.

దీనిని సరిగ్గా ఉపయోగించుకుని మా తమ్ముడు మా పడమటి పొలం లో తన చేను పక్కనే ఉన్నమా ఐదెకరాల మెట్టనీ దున్నించి తను సాగుచేసుకోవటం మొదలు పెట్టాడు. అక్కయ్య పంచాయతి పెట్టించినా ఒక్కళ్ళూ మా తరఫున మాట్లాడలేదు. అందరూ మౌనం గా ఉండిపోయారు. అక్కయ్య స్టేషన్ లో కేసుపెట్టి రెండు నెలలు పేటచుట్టూ తిరిగినా లాభం లేకపోయింది. పోలీసులకు ఏదో ముట్టజెప్పి మా తమ్ముడు కేసుని మాఫీ చేయించాడు.

అక్కయ్య పట్టు వదలకుండా కోర్టులో కేసువేసి, వాడికి నోటీసులు పంపించింది. “వాడసలే విషప్పురుగు వాడితో గొడవలు ఎందుకు అక్కయ్యా పోతే పోనీ మిగిలిన పొలం చూసుకుందాం" అన్నాను నేను. “చిట్టెమ్మా- - -... వాడు మనల్ని అవకాశం చూసి దెబ్బవేశాడు. ఇప్పుడు తలవంచామంటే మొత్తం లాక్కుని వీధిన పడేస్తాడు. ఆ దేవుడే మనకు చెయ్యాల్సినంత అన్యాయం చేసాడు. అంతకన్నా వీడేం చేస్తాడు. వీడిని మాత్రం వదిలేది లేదు " అని గట్టిగా చెప్పింది.

అది మొదలు ఊరిలో మనుష్యుల మధ్య తెలియని అగాధాలు ఏర్పడ్డాయి. పొలంలో పంట దొంగిలించారనో, గోంగూర కోశారనో, శనక్కాయలు పీకారనో దళితుల మీద నిందలు పెరుగుతున్నాయి. అలాగే గడిచిపోతోంది కాలం అక్కయ్యా నేనూ సాయంత్రాలు పల్లెవైపుగా వెళ్ళి వాళ్ళ పిల్లలకు చదువు చెప్పటం, కాస్త పురాణ కాలక్షేపం చేయించటం మానలేదు. కానీ వాళ్ళను అక్కున జేర్చుకుని పిల్లలకు దుస్తులూ ఇంకా వాళ్ళెప్పుడూ చూడని బిస్కెత్తులూ పండ్లూ లాంటి

తినుబండారాలు పంచిపెడుతూ వాళ్ళను ఓదార్చారు చర్చీలనుంచి వచ్చిన అమ్మగార్లు, అయ్యగార్లూ అక్కడికి రాకపోకలు మొదలుపెట్టారు.

తెల్ల దొరసానులూ, దొరలూ ఇంకా వారితో బాటు మన భాష తెలిసిన కొంతమందీ కలిసి అక్కడే తాటాకుల తో పెద్దపెద్ద పాకలు నిర్మించుకొని అక్కడే ఉండటం మొదలుపెట్టారు. అక్కడే ఉంటూ చుట్టుపక్కల ఊళ్ళలో కూడా తిరుగుతూ ప్రజల కష్ట సుఖాలు తెలుసుకుంటూ వారికి చేతనైన సాయం చేసేవాళ్ళు. ముఖ్యంగా వైద్య విధానం తెలిసిన వాళ్ళు కావటం తో చిన్న చిన్న వ్యాధులకు ఇంగ్లీషు మందులు ఇచ్చేవాళ్ళు.

వాళ్ళను దూరం పెట్టకుండా వ్యాధివచ్చిన వాళ్ళను దయతోటీ జాలితోటీ దగ్గరకు తీసేవారు. వాళ్ళ ఆదరాభిమానాలకు ముగ్ధులై చాలా మంది ఆ పాశ్చాత్య మతాన్ని స్వీకరించారు. రాను రాను వారికి మేము అక్కడికి వెళ్ళటం ఇబ్బందిగా అనిపించసాగింది. నెమ్మదిగానే "మీకెందుకమ్మా ఇంత శ్రమ మా పిల్లలకు అమ్మగార్లు చదువులు చెబుతున్నారు" అనేవాళ్ళు. అయినాసరే మొండిగా కొన్నాళ్ళు వెళ్ళాను కానీ ఒక్కరుకూడా ఆ సమయానికి రాకపోవటం తో మానేశాను.

కాకపోతే వారిలో మామీద అభిమానమైతే తగ్గలేదు. ఏ అవసరమైనా ఒక్క కేకవేస్తే వచ్చి నిలబడేవాళ్ళు. ఎప్పట్లా పొలం వాళ్ళకే కౌలుకి ఇచ్చి కొన్నాళ్ళ పాటు అక్కయ్యా నేనూ గుంటూరు వెళ్ళాలని నిర్ణయించుకున్నాం. గుంటూరులో విదేశీ వస్తు బహిష్కరణ లాంటి ఉద్యమాలు ముమ్మరంగా సాగుతున్నాయనీ, మీరుకూడా వస్తే బాగుంటుందన్న నిత్యానందయ్య గారి ఉత్తరం మాకు చాలా ఉత్సాహాన్ని ఇచ్చింది. పైగా ఊళ్ళో పరిస్థితులు కూడా మాకు బాధ కలిగిస్తున్నాయి.

కొంతకాలం ఊరికి దూరంగా ఉంటే ఈ విద్వేషాలు కాస్త తగ్గుతాయేమో అనిపించింది. ఈ సారి ఏమన్నా జరిగితే కనీసం ఊరినుంచి మాకు కబురు చేసేవాళ్ళు గానీ జాబు రాసేవాళ్ళు గానీ లేరు. మేము పుట్టిన దగ్గరినుంచీ మమ్మల్ని చూసిన ఊరు మా కష్టాలను ఎరిగిన ఊరు ఇద్దరం ఇంత కష్టపడుతుంటే మాటసాయం కూడా చెయ్యకుండా ఇంకా పట్టుదలలు పెంచుకుని ఇలా అయిపోయిందే అన్న బాధ మమ్మల్ని వదలలేదు. అయినా అక్కయ్య రాఘవయ్య అన్నయ్య ఇంటికి వెళ్ళి గుంటూరు వెళ్ళొస్తామని చెప్పింది.

"ఏమ్మా! మీరు లేక పోతే స్వాతంత్రోద్యమం ఆగి పోయిందని ఆ గాంధీ గారేమన్నా కబురు పెట్టారా? అయినా దొరికిన వాళ్ళను దొరికినట్లుగా జైళ్ళలో వేస్తున్నారట! తగుదునమ్మా అంటూ మీరూ వెళ్ళకపోతే ఏమి. మిమ్మల్నెవరు బొట్టెట్టి పిలిచారనీ ఇంత ఇదిగా పరుగులూ. అయినా పరాయి కొంపల్లో పడిఉంటూ అక్కడ ఊడిగం చెయ్యకపోతే ఉన్న దేదో తమ్ముడి చేతిలోపెట్టి గౌరవంగా ఉండొచ్చుకదా! మగరాయిళ్ళలా దేశమ్మీద పడి తిరగకపోతే" అంటూ ఎక్కెసెక్కెంగా మాట్లాడాడట.

అక్కయ్య అంతకంటే గట్టిగా " అంత గొప్ప మగాళ్ళందరూ నాయిల్లూ నా పిల్లలూ అని ఇళ్ళలో కూర్చుంటే ఏం చేస్తాం. తాడూ బొంగరం లేని ఆడాళ్ళం మావల్లనన్నా స్వాతంత్రం వస్తుందేమోనన్న ఆశ. దేశం కోసం చనిపోతేపోతాం. ఉండి ఉద్ధరిచ్చేదేమున్నది గనుక. మీరు మీ ఇళ్ళూ, పొలాలూ, ఆస్థిపాస్థులూ జాగ్రత్తగా కాపాడుకుంటూ ఉండండి. దేశాన్నే లాక్కున్న వాళ్ళకు ఇదో లెక్కా ...బ్రిటీషువాడి చెయ్యి మీదాకా వచ్చినప్పుడు అప్పుడు గగ్గోలు పెడుదురుగాని. అనిచెప్పి వెనక్కి వచ్చేసిందట.

ఇంటికి వచ్చాక చాలా బాధ పడింది. "ఆ బ్రిటీషువాళ్ళ కంటేదేశమెలాపోతే మనకేంటిలే అనుకునే ఇలాంటి వాళ్ళవల్లే దేశానికి మరింత నష్టం చిట్టెమ్మా" అని అన్నది నాతో. కలత పడ్డ మనసులతోటే గుంటూరు చేరాం. కానీ అక్కడికి వెళ్ళాక అంతా మర్చిపోయాం. రాట్నం వడకటం, హిందీ నేర్పించటం, స్వతంత్ర గీతాలు అందరం సామూహికంగా పాడుతూ నేర్చుకుంటూ, నేర్పిస్తూ రోజులెలా గడిచిపోయేవో మాముందు దేశస్వాతంత్ర్యమూ గాంధిగారి మాటలూ తప్ప ఇంకే విషయాలూ ఉండేవి కావు.

అదొక సంబరం అదొక సంతోషం. మాముందు గొప్పనాయకులున్నారన్న ఆనందం. తప్పకుండా స్వాతంత్ర్యం లభిస్తుందన్న నమ్మకం. అంతేకాక ఇంట్లో జరిగే ఉద్యమం గురించిన చర్చలు మాలో చాలా ఉత్సాహాన్ని నింపి ఆత్మవిశ్వాసాన్ని పెంచేవి అనిచెప్పింది అమ్మమ్మ.వెలుగుతున్న అమ్మమ్మ మొహమే చెబుతోంది వాళ్ళు ఆరోజుల్లో ఎంత ఉత్సాహభరితంగా ఉన్నారో. అమ్మమ్మకూ, నాకూహాయిగా నిద్రపట్టేసింది.

*(కొనసాగింపు వచ్చే సంచికలో..!)*

Post your comments